

శ్రావణం.. శుభకరం
నేటి నుంచి శ్రావణ మాసం ఆరంభం కానుంది. పండుగలు, ఆలయాల్లో విశేష పూజలతో సందడి నెలకొంటుంది. మహిళలు నోములు, వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తారు. 8లో▸



కేంద్రం నిధులతోనే పాఠశాలల అభివృద్ధి
కేంద్రం నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని ఎమ్మెల్యే హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లో క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0 /25.0
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

రోడ్లకు మహర్దశ


'హ్యామ్'లో బాగు చేయనున్న కన్నెపల్లి మండలం రెబ్బెన-ముత్తాపూర్ రోడ్డు

- 'హ్యామ్' పద్ధతిలో రహదారుల పనులు
- రోడ్ల వెడల్పు, మరమ్మతులకు వీలు
- పీఆర్, ఆర్అండ్‌బీ దారుల జాబితా సిద్ధం
- టెండర్లు పిలిచి పనులు చేసేందుకు సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అన్ని కాలాల్లో రవాణాకు వీలుండే రోడ్లు ఉంటేనే ఆ ప్రాంతాలు వృద్ధిలోకి వస్తాయి. ఇప్పటికీ జిల్లాలో అనేక గ్రామాలకు సరైన రోడ్ల సౌకర్యం లేదు. ఈ పరిస్థితిని మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'హ్యామ్'(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్)లో రోడ్లు బాగు చేయనుంది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, రోడ్లు, భవనాల (ఆర్అండ్‌బీ) శాఖల పరిధిలో అవసరమైన చోట్ల పనులు చేపట్టనుంది. ఈ పద్ధతిలో ప్రభుత్వం 40శాతం నిధులు, మిగతా 60శాతం ప్రైవేటు సంస్థ భరిస్తుంది. తర్వాత నిర్దిష్ట కాలంలో ఖర్చు చేసిన ఆ సంస్థకు సర్కారు చెల్లిస్తుంది. నాణ్యత, నిర్వహణ పర్యవేక్షిస్తూనే చెల్లింపులు ఉంటాయి. జాతీయ రహదారుల్లో ఈ పద్ధతి ప్రవేశపెట్టగా, ప్రస్తుతం గ్రామీణ రోడ్లకు ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ పద్ధతిలో ప్రస్తుతమున్న రోడ్ల వెడల్పు, మరమ్మతులు పూర్తి చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు తమ పరిధిలో రోడ్ల నిర్మాణాల కోసం అధికారులకు నివేదికలు సమర్పించగా, ఆ మేరకు పనులు జరగనున్నాయి.

ఆర్అండ్‌బీ పరిధిలో 12దారులు

రాష్ట్రంలో మొదటి దశలో 17ప్యాకేజీల్లో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేయనుంది. ఇప్పటికే రెండు కన్సల్టెన్సీ సంస్థలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక(డీపీఆర్)ను ప్రభుత్వానికి అందించాయి. ఆరు ప్యాకేజీలు ప్రతిపాదించగా ఇందులో ఆర్అండ్‌బీ సర్కిల్ వారీగా రోడ్డు పనులు పూర్తి చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో మంచిర్యాల సర్కిల్‌లో జిల్లాతోపాటు ఆసిఫాబాద్ జిల్లా ఉంది. ఈ రెండు జిల్లాల్లో మొత్తం 12రోడ్లు, 259.23కిలోమీటర్ల నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.294.29కోట్లు అవుతాయని అంచనా వేసింది.

'పంచాయతీరాజ్'లో మూడు దశల్లో..

జిల్లా పరిధిలో పంచాయతీరాజ్(పీఆర్) ఇంజినీరింగ్ శాఖ అధికారులు మూడు దశల్లో మొత్తం 104రోడ్లను బాగు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో మొదట 58, రెండో విడత 29, మూడో విడతలో 17 రహదారుల పనులు ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖ పరిధిలో టెండర్ పిలవాలని ఆదేశాలు రాగా, పంచాయతీరాజ్ విభాగపు రోడ్లకు ఈ వారంలో ప్రతిపాదిత రోడ్లకు ఆమోదం రానుంది. దీంతో దశలవారీగా పూర్తి చేయాల్సి ఉంది. ఈ క్రమంలో జిల్లాలో అనేక గ్రామీణ రోడ్లకు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి కానున్నాయి. వర్షాకాలంలో గ్రామాలకు రవాణా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల రోడ్లు బాగాలేక ప్రజా రవాణా సమస్యగా మారింది. ప్రభుత్వం పంచాయతీరాజ్ పరిధిలో రోడ్లను బాగు చేస్తే రవాణా కష్టాలు తీరనున్నాయి.

తీరని రవాణా కష్టాలు

జిల్లాలో జాతీయ, రాష్ట్రీయ రహదారులు మినహా జిల్లా కేంద్ర నుంచి మండల కేంద్రాలు, మండల కేంద్రాల నుంచి గ్రామాలకు, గ్రామాలకు మధ్య కలిపే రోడ్లు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. ఏటా వర్షాకాలంలో కల్వర్టులు, వంతెనలు, కాజ్‌వేలు, మరమ్మలులు చేయాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో చేయడం లేదు. తాత్కాలిక పనులు చేస్తూ వస్తున్నారు. చాలా చోట్ల తారు దెబ్బతిని, కంకర తేలి ఉంటున్నాయి. మరమ్మతులకు నోచుకోవడం లేదు. తాజాగా హ్యామ్ పద్ధతిలో పనులు చేపడితే జిల్లా రహదారులకు మహర్దశ కలుగనుంది.

మళ్లీ భువన్ సర్వే

- కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ప్రక్రియ
- సెప్టెంబర్ 30లోగా పూర్తికి ఆదేశాలు
- పెరగనున్న ఆస్తిపన్ను డిమాండ్


నస్పూర్‌లో సర్వే చేస్తున్న వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో భువన్ సర్వే మళ్లీ మొదలైంది. గతంలో సర్వే నిర్వహించని ఇళ్లు, వ్యాపార సంస్థలతోపాటు కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్ మున్సిపాల్టీ, హాజీపూర్ మండలంలోని ఐదు గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. సెప్టెంబర్ 30వరకు సర్వే పూర్తి చేయాలనే గడువు విధించడంతో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొంటున్నారు. సర్వే పూర్తయితే కొత్తగా పన్ను మదింపు చేస్తారు. దీంతో ఆస్తి పన్ను డిమాండ్ భారీగా పెరగనుంది. కార్పొరేషన్ పరిధిలో 60డివిజన్లు ఉండగా 2,48,283మంది జనాభా ఉన్నారు. అన్ని రకాల ఆస్తులకు సంబంధించి 49,643 అసెస్‌మెంట్లకుగాను రూ.30.23కోట్ల మేర ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. మొదట్లో ఇళ్ల విస్తీర్ణానికి సంబంధించి కొలతలు సరిగా తీసుకోకపోవడం, అంతస్తులను నమోదు చేయకపోవడంతో ఆశించిన స్థాయిలో ఆస్తి పన్ను వసూలు కాలేదు. 202–21లో భువన్ సర్వే నిర్వహించగా.. అప్పుడు 75శాతం మాత్రమే పూర్తయింది. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగతా అసెస్‌మెంట్లకు సంబంధించి సర్వే చేస్తున్నారు.

పేదలకు ఎక్కువ.. పెద్దలకు తక్కువ..

గత సర్వేలో ఇళ్ల విస్తీర్ణం, భవనాలు, అంతస్తుల కొలతలు తప్పుగా నమోదు చేశారనే ఆరోపణలున్నాయి. ఖాళీ ప్లాట్లకు సైతం ఇంటి నంబర్లు కేటాయించి సర్వేలో నమోదు చేశారనే విమర్శలు వచ్చాయి. రాజకీయ పలుకుబడితో భవనాలు, అంతస్తులకు తక్కువగా, పేదలకు ఎక్కువగా ఆస్తి పన్ను విధించారనే దుమారం చెలరేగింది. ఇళ్ల నంబర్లు ఉన్న ఆస్తులనే భువన్‌లో నమోదు చేయాల్సి ఉండగా సర్వే చేసేవాళ్లు ఇష్టారీతిగా కొలతలు తీసి జియో ట్యాగింగ్ చేశారు. సర్వేలో తప్పుగా నమోదు చేసి పన్ను ఎక్కువ వచ్చేలా చేశారని, ఆ పన్నులు తగ్గించాలని పలువురు ఇప్పటికీ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. దరఖాస్తు ఇస్తే విచారణ చేస్తామని అధికారులు చెబుతున్నా ఏడాదిగా కాలం వెళ్లదీస్తున్నారని పలువురు వాపోతున్నారు. కాగా, సర్వేకు వెళ్తున్న వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లకు గుర్తింపు కార్డులు లేక ఇళ్ల యజమానుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అందరికీ న్యాయం



గతంలో నిర్వహించిన భువన్ సర్వే తప్పుల తడకగా సాగిందని, తమకు ఎక్కువ పన్నులు వేశారని ఫిర్యాదులు వచ్చాయి. చాలావరకు అన్నింటినీ సవరించేలా రివైజ్ చేస్తున్నాం. తిరిగి ప్రారంభమైన భువన్ సర్వేలో బాధితులకు న్యాయం జరుగుతుంది. మిస్సింగ్ అయిన ఇళ్లతోపాటే ఏ ఇంటినీ వదలకుండా వ్యాపార భవనాలు, అంతస్తులు, బహుళ అంతస్తులు ఇలా సర్వే చేస్తున్నాం. సిబ్బంది పకడ్బందీగా సర్వే చేపడుతున్నారు.

– సంపత్‌కుమార్, కమిషనర్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్

మెరుగైన వైద్య సేవలకు చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం ఆయన కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, హాజరు పట్టికలు పరిశీలించారు. రేగులగూడ, మల్కేపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలు, దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శించి సూచనలు చేశారు. మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్, ఆశ్రమ పాఠశాలల ప్రత్యేకాధికారి నీరటి రాజేశ్వరి, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, మండల పంచాయతీ అధికారి షేక్ సబ్దర్ అలీ పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రామపాలన అధికారి పరీక్ష


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గ్రామపాలన అధికారి పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి జిల్లా అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గ్రామపాలన అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ పాలన అధికారి పరీక్షకు 70 మంది, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు 156 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

నెన్నెల: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందస్తుగా చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ముందస్తు టెండర్లు?



- ఎక్సైజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు
- ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో గ్రామసభలు
- తీర్మానాలు సేకరిస్తున్న అధికారులు
- నవంబర్ వరకు గత షాపుల గడువు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వైన్‌షాపులకు ముందస్తు టెండర్లు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో వైన్‌షాపులు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా పెసా యాక్ట్ ప్రకారం గ్రామసభ తీర్మానం తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అనుకూలంగా తాజాగా ఎక్సైజ్ కమిషనర్ నుంచి ఆ శాఖ జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో అధికారులు ఏజెన్సీ గ్రామాల్లో గ్రామసభల ద్వారా తీర్మానాలు సేకరించి ఈనెల 27వరకు కమిషనర్‌కు పంపించనున్నారు. దీని ద్వారా ప్రభుత్వం వైన్‌షాపులకు ముందస్తు టెండర్ల నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు లిక్కర్ వ్యాపారుల్లో చర్చ మొదలైంది.

తీర్మానాలు సేకరిస్తున్న అధికారులు

రెండేళ్ల కిందట అంటే.. 2023 నవంబర్‌లో బీఆర్ఎస్ హయాంలో వైన్స్‌లకు సంబంధించి టెండర్లు నిర్వహించారు. వచ్చే నవంబర్‌లో వాటి కాలపరిమితి ముగియనుంది. అప్పట్లో బీఆర్ఎస్ సర్కార్ కూడా ఎన్నికలకు ముందే ముందస్తు టెండర్లు నిర్వహించింది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు ముందుండగా, ఈ టెండర్లు నిర్వహించడం ద్వారా ఔత్సాహికుల్లో లిక్కర్ షాప్ దక్కించుకోవాలనే పోటీ కనిపిస్తుందని, తద్వారా అధిక ఆదాయం లభిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కాగా, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో డీపీఈవోలు ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల్లో గ్రామసభల ద్వారా అక్కడ వైన్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా తీర్మానాలు సేకరించే పనిలో పడ్డారు. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి కమిషనర్ ఆఫీస్‌కు పంపించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఆదిలాబాద్‌లో ఉంది. ఆదిలాబాద్ డివిజన్ కార్యాలయంగా దీన్ని పిలుస్తారు. దీని పరిధిలో మొత్తం 192 వైన్స్‌లున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 40, నిర్మల్‌లో 47, మంచిర్యాలలో 73, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 32 చొప్పున ఉన్నాయి. ఏటా సుమారు రూ.1,400 కోట్ల డిమాండ్ మేర మద్యం విక్రయాలు జరుగుతాయి.

తీర్మానాలు సేకరిస్తున్నాం



పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామసభల ద్వారా వైన్‌షాపులు ఏర్పాటు చేసేందుకు తీర్మానాలు సేకరిస్తున్నాం. ఎక్సైజ్ టెండర్లను ముందస్తుగా నిర్వహించే విషయంలో మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– హిమశ్రీ, డీపీఈవో

అక్రమ నిర్మాణాలు అడ్డుకోండి

- చెత్తాచెదారం, డ్రెయినేజీల సమస్య తీర్చండి
- కుక్కల బెడద నివారించాలని వేడుకోలు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో వినతుల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి కృషి
- మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్

బెల్లంపల్లి: 'బల్దియాలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగు పడలేదు. ఫుట్‌పాత్ కబ్జా, అక్రమ నిర్మాణాలు అడ్డుకోండి. వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కల బెడద నివారించాలి. మురికి నీటి కాలువల్లో పూడిక నిండి వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది..' అంటూ బెల్లంపల్లి మున్సిపాల్టీలోని ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టారు. పట్టణంలోని సమస్యలపై గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌తో ఫోన్ ఇన్ నిర్వహించింది. ప్రజల సమస్యలను సావధానంగా విన్న కమిషనర్ రమేష్ పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

ప్రశ్న: కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, మురికికాలువలు నిర్మించాలి. పారిశుద్ధ్య సిబ్బందిని వార్డుకొకరు చొప్పున కేటాయించి మురికి నీటి కాలవలు రోజువారీగా శుభ్రం చేయించాలి. కాంట్రాక్టర్ బస్తీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురికి నీరు ఇళ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్నాం. శాంతిఖని బస్తీ మురికి కాలువల్లో ఏడాదిగా పూడిక తీయలేదు. నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. పెద్దనపల్లి బస్తీలో డ్రెయినేజీల అసంపూర్తి నిర్మాణంతో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందాయి.

– వంశీకృష్ణ, కొత్తబస్టాండ్ ఇందిరమ్మకాలనీ, కే.చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్, గర్రెపల్లి నాగరాజు, రాకేష్, గంగిశెట్టి శ్యామ్‌కుమార్, శ్రీధర్, జోగు మల్లేష్(18వ వార్డు కాంట్రాక్టర్ బస్తీ), బి.ఓదెలు, 22వ వార్డు, జంగం బాలచందర్, కన్నాల బస్తీ, దుర్గం శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, శాంతిఖని బస్తీ, మోహన్‌రావు, 24డీప్ ఏరియా, అబ్దుల్ అలీమ్, పెద్దనపల్లి బస్తీ

కమిషనర్: ఇందిరమ్మ కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పూడిక తీయిస్తాం. ఇళ్లలోకి మురికి నీరు చేరకుండా కట్టడి చేస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పెద్దనపల్లిబస్తీలో మురికి కాలువ నిర్మాణ పనులు జరిగేలా చూస్తాం.

ప్రశ్న: పాత రామాటాకీసు పక్క వీధి, అశోక్‌నగర్ బస్తీలో వీధి దీపాలు వెలగడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పాతబస్టాండ్ చౌరస్తా డివైడర్ వద్ద హైమాస్ట్ లైటు వెలగడం లేదు. ఆటంకంగా ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలి.

– కమల్ కిషోర్, కాంట్రాక్టర్ బస్తీ, డి.వేణుగోపాల్, అశోక్‌నగర్, దొంతుల రామకృష్ణ, పాతబస్టాండ్ ఏరియా

కమిషనర్: వీధి దీపాలు, హైమాస్ట్‌లైట్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకుంటాం. అడ్డుగా ఉన్న బోర్డులను తొలగించే చర్యలు చేపడుతాం.


ఫోన్‌లో సమస్యలు వింటున్న కమిషనర్ తన్నీరు రమేష్

ప్రశ్న: అంబేద్కర్ చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీ మీదుగా పోషమ్మగడ్డ చౌరస్తా వరకు మార్కింగ్ చేసి వదిలేశారు. ఎప్పటిలోగా రోడ్డు వెడల్పు పనులు చేపడుతారు. జాతికుంట చెరువు మత్తడిని రైల్వే అధికారులు మూసివేయడంతో ప్రమాదం పొంచి ఉంది. మత్తడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోండి. – వై.శ్రీనివాస్, రాజన్న, 19వ వార్డు, కే.నరేష్, 9వ వార్డు

కమిషనర్: రోడ్డు విస్తరణకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. సింగరేణి అంతర్గత లైన్ మార్చాల్సి ఉంది. నెల రోజుల వ్యవధిలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తాం. రైల్వే అధికారులతో మాట్లాడి మత్తడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

కబ్జాలు.. ట్రాఫిక్ సమస్యపై..

ప్రశ్న: రైల్వేస్టేషన్ ఏరియాలో డ్రెయినేజీ కాలువ కబ్జా చేసి మురికి నీరు వెళ్లకుండా పూడ్చారు. బజార్‌ఏరియాలో ఫుట్‌పాత్ ఆక్రమణతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌ను కబ్జా చేసి కొందరు వీధి వ్యాపారుల నుంచి అద్దె వసూలు చేస్తున్నారు. 25వ వార్డులోని ఓ వీధిలో అంతర్గత రోడ్డును ఆనుకుని ఇళ్లు నిర్మించడంతో ఆటోలు వెళ్లలేకపోతున్నాయి. 31వ వార్డులో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు.

– గాలి శ్రీనివాస్, రైల్వేస్టేషన్ ఏరియా, పసులేటి వెంకటేష్, హన్మాన్‌బస్తీ, వెంకటేశ్వర్లు, 25వ వార్డు, సదానందం, 31వ వార్డు, కొలిపాక శ్రీనివాస్, కాంట్రాక్టర్ బస్తీ

కమిషనర్: టౌన్‌ప్లానింగ్ అధికారులను పంపించి పరిశీలిస్తాం. మురికి కాలువలు పూడ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. ఆటోలు వెళ్లకుండా ఆటంకంగా ఉన్న ఇళ్లను కూల్చివేయిస్తాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తాం. అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదు. నోటీసులు జారీ చేసి కూల్చివేయిస్తాం. ఫుట్‌పాత్‌ను కబ్జా చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కాంటా చౌరస్తా నుంచి పాతబస్టాండ్ వరకు ఆటోలకు పార్కింగ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. – కే.రామ్‌కుమార్, ఆటోవర్కర్స్ సంఘం అధ్యక్షుడు

కమిషనర్: ఆటో పార్కింగ్ స్థలాలను గుర్తించే చర్యలు తీసుకుంటాం. గతంలో గుర్తించిన స్థలాల్లో తోపుడు బండ్లు పెట్టినట్లయితే తొలగిస్తాం. టాయిలెట్స్ నిర్మాణానికి శ్రద్ధ చూపుతాం.

ప్రశ్న: హన్మాన్‌బస్తీ, బెల్లంపల్లిబస్తీల్లో చెత్తబండి రెగ్యులర్‌గా రావడం లేదు. పారిశుద్ధ్యం లోపించి ఇబ్బందులు పడుతున్నాం. బూడిదగడ్డ బస్తీ వీధుల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. ప్రభుత్వ లైబ్రరీ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందాయి.

– ఎండీ.గౌస్, బెల్లంపల్లిబస్తీ, శివప్రసాద్, హన్మాన్‌బస్తీ, జుట్టు రాజన్న, బూడిదగడ్డ బస్తీ, రవీందర్, బజార్‌ఏరియా

కమిషనర్: చెత్తట్రాలీలు మరమ్మతులో ఉన్నాయి. అందువల్లే రెగ్యులర్‌గా రావడం లేదు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పిచ్చిమొక్కల తొలగింపు చర్యలు చేపడుతాం. దోమల బెడద లేకుండా చూస్తాం.

ప్రశ్న: అంబేద్కర్‌నగర్ చౌరస్తా నుంచి రవీందర్ నగర్‌కు వెళ్లే రోడ్డు పనులు నాసిరకంగా జరిగాయి. అసంపూర్తిగా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. – బత్తుల రవి, రవీందర్‌నగర్

కమిషనర్: మున్సిపల్ డీఈని పంపించి రోడ్డు పరిశీలిస్తాం. ఫిర్యాదు చేస్తే వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీధుల్లో స్వైరవిహారం చేస్తుండడంతో భయం కలుగుతోంది. నివారణ చర్యలు తీసుకోండి. – సరిత, స్టేషన్ రోడ్‌కాలనీ

కమిషనర్: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. మంచిర్యాల సెంటర్‌కు పంపించి కు.ని ఆపరేషన్లు చేయిస్తాం.

న్యూస్‌రీల్

పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించాలి
- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు
- సీపీ అంబర్ కిషోర్ ఝా


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: పోలీసు అధికారులు సమన్వయంతో పని చేసి పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంపొందించాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా ఈ ఏడాదిలో నమోదైన కేసులు, పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్లపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించి పోలీసు ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీసీపీలు ఎగ్గడి భాస్కర్, కరుణాకర్, అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మల్లారెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


మాట్లాడుతున్న డీఏవో ఛత్రునాయక్

మందమర్రిరూరల్/నెన్నెల/జైపూర్/దండేపల్లి/జన్నారం: జిల్లాలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) ఛత్రునాయక్‌తోపాటు మండల వ్యవసాయ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మందమర్రి ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్ తనిఖీ చేసి నిల్వల రికార్డులు పరిశీలించారు. ఎరువుల కొరత లేదని, రైతులు కంగారు పడాల్సిన పని లేదని అన్నారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి పాల్గొన్నారు.

- నెన్నెలలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను భీమిని ఏడీఏ సురేఖ, మండల వ్యవసాయ అధికారి సృజన తనిఖీ చేశారు. నిల్వ రిజిష్టర్లు, రశీదు పుస్తకాలు పరిశీలించారు.
- జైపూర్ మండలంలో ఫర్టిలైజర్ దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఏవో మార్క్‌గ్లాస్టన్, ఎస్సై శ్రీధర్ తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు యూరియా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.
- దండేపల్లి మండలం గూడెం సహకార సంఘం, చింతపల్లి, దండేపల్లి, తాళ్లపేట, మేదరిపేట గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, ఏవో అంజిత్‌కుమార్, ఎస్సై తహసీనొద్దీన్ తనిఖీ చేశారు.
- జన్నారం మండలంలోని ఫర్టిలైజర్, గ్రోమోర్ దుకాణాలు, గోదాములను ఎస్సై గొల్లపల్లి అనూష, ఏవో సంగీత తనిఖీ చేసి రిజిష్టర్లు పరిశీలించారు.

జిల్లాలో 23.6 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 23.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కన్నెపల్లి మండలంలో 48.1 మిల్లీమీటర్లు, వేమనపల్లిలో 44.9, భీమినిలో 38.2, బెల్లంపల్లిలో 36.3, కాసిపేటలో 34.3, తాండూర్‌లో 32.5, నెన్నెలలో 30.4, జన్నారంలో 26, కోటపల్లిలో 22.9, మందమర్రిలో 21.1, మంచిర్యాలలో 14.1, హాజీపూర్‌లో 12.8, నస్పూర్‌లో 12.7, జైపూర్‌లో 12, చెన్నూర్‌లో 11, లక్సెట్టిపేటలో 10.7, భీమారంలో 9.6, దండేపల్లిలో 7.7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 408.6 కురవాల్సి ఉండగా 288 మిల్లీమీటర్లు కురిసింది. ఇంకా జిల్లా సగటున 31శాతం లోటుగా నెలకొంది..

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: ఎడతెరిపి లేని వర్షాలతో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టులో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. క్వారీలో మైనింగ్ పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఓవర్ బర్డెన్ మట్టి తొలగింపు పనులు ఆగిపోయాయి. రెండు రోజుల్లో సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. 1.6లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయి.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులకు గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ షాక్‌తో తండ్రీ కొడుకులు తీవ్ర గాయాలపాలైన ఘటన జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. క్రిస్టల్ గార్డెన్ సమీపంలో నివసిస్తున్న అఫ్రోజ్ ఖురేషి పని నిమిత్తం ఇంటిపైకి ఎక్కాడు. ఆరడుగుల ఎత్తులో 33 కేవీ విద్యుత్ లైన్‌కు తాకడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన కుమారుడు కైఫ్ ఖురేషి తండ్రిని ముట్టుకోవడంతో అతనుసైతం షాక్‌కు గురయ్యాడు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా గతంలో ఈ ప్రాంతంలోనే ఓ స్కూల్ బస్సు విద్యుత్ తీగలకు తాకడంతో అటెండర్ మృతి చెందాడు. ఓ విద్యార్థిని సైతం షాక్‌కు గురై మృత్యువాతపడినట్లు స్థానికులు తెలిపారు. ఇళ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మామడ మండలంలోని న్యూలింగంపెల్లికి చెందిన దేవరశెట్టి అనిల్ బుధవారం ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ వెళ్లాడు. పని ముగిసిన తర్వాత రాత్రి సమయంలో ఇంటికి వెళ్తుండగా ఒడ్డెపెల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సెప్టెంబర్ 3న ట్రిబ్యునల్ విచారణ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఆండాళమ్మ కాలనీలో డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను కాల్చడం ద్వారా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు చేసిన ఫిర్యాదుపై విచారణ సెప్టెంబర్ 3కు వాయిదా పడిందని ఫిర్యాదుదారుడు నయీంపాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది తాను ఫిర్యాదు చేయగా కమిటీని ఏర్పాటు చేశారని, సభ్యులు డంపింగ్‌యార్డును పరిశీలించిన అనంతరం ట్రిబ్యునల్‌కు నివేదిక పంపించారన్నారు. దీనిపై చెన్నైలో విచారణ సాగుతుండగా జిల్లా అధికారులు కొత్తగా డంపింగ్‌యార్డుకు స్థలం సేకరించామని, స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి వచ్చిందని, ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డు స్థలాన్ని ఖాళీ చేశామనే సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై తాను అభ్యంతరం తెలుపగా కొత్త స్థలం ఫొటోలతో సహా సమర్పించాలని న్యాయవాదిని ఆదేశించారని, 3న విచారణ జరుగుతుందన్నారు.

శ్రావణం..శుభకరం..!

- నేటి నుంచి శ్రావణ మాసం ఆరంభం
- మహిళలకు ప్రీతిపాత్రం
- ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి



గౌతమినగర్‌లోని ఆలయంలో శివునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు శంశాక్‌శర్మ

మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖైన్‌గేట్/చెన్నూర్: శ్రావణం..శుభకరం.. అందుకే ఈ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. గురువారంతో ఆషాఢ మాసం ముగిసిపోయి సకల శుభకార్యాలకు శుభప్రదంగా భావించే శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మహిళలు భక్తితో అమ్మవారిని ఆరాధించే పూజల మాసం. ఈమాసంలో వచ్చే సోమ, మంగళ, శుక్రవారాలు ఎంతో ప్రత్యేకమైనవి. వివాహాలు, గృహప్రవేశాలు, వాహనాల కొనుగోళ్లు, శుభకార్యాలు శ్రావణంలో జరుపుకునేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. ఈనెలలోనే పౌర్ణమిరోజు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించటం వల్ల శ్రావణ మాసం అనే పేరు వచ్చిందని వేదపండితులు చెబుతున్నారు. ఈనెల రోజుల్లో దైవకార్యాలకు ఎంతోశక్తి ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి.

నోములు, వరలక్ష్మి వ్రతాలు..

శ్రావణమాసం అంటే ప్రతీ మహిళకు ఇష్టమే. ఇంటిల్లిపాదీ సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని మహిళలు కోరుకుంటారు. ఇల్లే దేవాలయంగా భావించి అమ్మవారిని ప్రతిష్ఠించి మంగళగౌరి నోములు, వరలక్ష్మి వ్రతాలు, ఆచరిస్తారు. ఇంటింటా ప్రత్యేక పూజలతో పాటు ఉపవాస దీక్షలు చేస్తారు. మంగళ, శుక్రవారాల్లో శ్రీలక్ష్మీ దేవికి ఆలయాల్లో విశేష పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తారు. శివుని అభిషేకానికి ప్రాధాన్యం ఉంటుంది. ప్రతీ సోమవారం శ్రావణ సోమవార వ్రతం ఆచరించడం ద్వారా శివుని అనుగ్రహం పొందుతారని నమ్మకం. దూదీలపువ్వు, పాలు, తేనె, గంగాజలంతో అభిషేకం చేయడం వల్ల పాపాలు నివృత్తి అవుతాయి. తులసి, ధాన్యం, దానం, అన్నదానం చేయటం విశేష ఫలితాన్ని ఇస్తుంది.

శ్రావణమాసంలో ఇలా..

ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 10, 13, 15, 17, తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇన్నాళ్లు పెళ్లిళ్లు గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు దూరంగా ఉన్నారు. శుక్రవారం నుంచి మంచిరోజులు వచ్చాయి. పురోహితుల నుంచి ఫొటోగ్రాఫర్లు, భాజాభజంత్రీలు, ఈవెంట్ల నిర్వాహకులు, వస్త్ర దుకాణాలు, పూలు, పండ్లు, ప్రింటింగ్ ప్రెస్‌లకు డిమాండ్ పెరగనుంది. నెలరోజుల పాటు శ్రీలక్ష్మీ అమ్మవారికి పూజలు చేయటంతో పాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, గృహప్రవేశాలు, అక్షరాభ్యాసం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు.

పండుగలు, ఉత్సవాలు

ఈ నెల 29న నాగపంచమి, ఆగస్టు 8వ తేదీన వరలక్ష్మీ వ్రతం, 9వ తేదీన రాఖీ పండుగ, 16న శ్రీకృష్ణాష్టమి, 23న పొలాల అమావాస్య వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నాయి. ఆగస్టు 22వ తేదీన ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది. శ్రావణం పూర్తయిన వెంటనే ఆగస్టు 27న వినాయకచవితితో భాద్రపద మాసం ప్రారంభమవుతుంది.

విష్ణు పూజలకు ప్రసిద్ధి..

సర్వమంగళ కారిణియైన గౌరి, లక్ష్మీ, హరిహరులను విశేషంగా అర్చించే నెల కూడా ఇదే. చాంద్రమాసం ప్రకారం శ్రావణాన్ని ఐదో నెలగా పరిగణిస్తారు. శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం కావటంతో విష్ణు పూజలకు ప్రసిద్ధి. ఈ నెలలో వచ్చే మంగళ, శుక్ర, శనివారాలను అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరీ పూజలు, శుక్రవారాల్లో లక్ష్మీపూజలు, శనివారాల్లో విష్ణు పూజలు చేస్తారు.

శుభాలమాసం..

హిందూ సంప్రదాయంలో శ్రావణమాసం చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. వేదపారాయణాలు, వ్రతాలు, పూజలు, శివారాధనకు అత్యంత అనుకూలమైన మాసం. ఈమాసంలో భగవంతుడిని భక్తితో ఆరాదిస్తే సకల శుభాలు కలుగుతాయి. నోములు, వ్రతాలకు అనుమైన మాసం. సిరి సంపదలు ప్రసాదించాలని మహాలక్ష్మీ అమ్మవారిని కొలిచే శ్రావణమాసంలో శివశక్తిని సైతం పూజిస్తారు. తపస్సు, ధ్యానం, జపం, యోగాభ్యాసం చేయటానికి అనుకూలం. ప్రకృతి ఉత్కృష్టంగా ఉంటుంది. ఆధ్యాత్మిక సాధనకు శుభంగా పరిగణించబడుతుంది.

– శ్రీరాంభట్ల శంశాక్‌శర్మ, అర్చకుడు, మంచిర్యాల

అన్నీ మంచిరోజులే..



శ్రావణ మాసంలో అన్నీ మంచిరోజులే. ఈ మాసాన్ని పండుగల మాసమని, వ్రతాల మాసమని చెప్పవచ్చు. శివునికి ప్రీతి పాత్రమైన మాసం కావడంతో ఏకబిల్వం శివార్పణం అంటూ పూజలు చేస్తే ఆ శివుని అనుగ్రహం లభిస్తుంది. యువతులు, మహిళలు, వరలక్ష్మీ, మంగళగౌరీ వ్రతాలు, నోములు జరుపుకుంటారు. ఈ మాసంలో శుభకార్యాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– వేమారం మహేశ్వరశర్మ, పురోహితుడు, చెన్నూర్

ఆర్జీయూకేటీలో గ్లోబల్ కోటా ఫీజుపై కౌన్సెలింగ్



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర:ఆర్జీయూకేటీలో బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో గ్లోబల్ కోటా కింద సీట్లు పొందే విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుపై వారి తల్లిదండ్రులకు బాసర ట్రిపుల్ ఐటీలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ విద్యార్థులు, తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందే విధానం, అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యా విధానం, సీట్లు, ఫీజు విధానం, క్యాంపస్ వసతులను వివరించారు.

నకిలీ 'ఆధార్' తయారు చేస్తున్న ఒకరి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఆధార్ కార్డులు తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన చరణ్‌సింగ్, సందీప్ పట్టణంలోని భాగ్యనగర్, క్రాంతినగర్‌లో స్థానిక ఆధార్ కార్డులు, ఇతర నకిలీ ఐడీ ప్రూఫ్‌లను తయారు చేసి మధ్యప్రదేశ్‌కు చెందిన తమ సంబంధీకులకు పంపిస్తున్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈవిధంగా పాల్పడుతున్నట్లు చెప్పారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని విచారించగా ఈ విషయం బయటపడింది. చరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, సందీప్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



మనోహర్‌సింగ్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని ఖండాల జలపాతంలో బుధవారం గల్లంతైన మనోహర్ సింగ్ (17) మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో నివాసముంటున్న పర్మార్ డొంగల్‌సింగ్, జెడియాకవర్ దంపతుల పెద్ద కుమారుడు మనోహర్ సింగ్ ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఇద్దరు స్నేహితులతో కలిసి సరదాగా ఖండాల జలపాతానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గురువారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

డ్రెయినేజీలోపడి వృద్ధుడు మృతి



ఎల్లప్ప మృతదేహం

బాసర: బాసర బస్టాండ్ సమీపంలోని డ్రెయినేజీలో పడి ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుభీర్ మండలంలోని సావ్లి గ్రామానికి చెందిన గంగ సముద్రవార్ ఎల్లప్ప(60) పన్నెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి బాసరకు వచ్చాడు. చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తున్న ఎల్లప్ప బుధవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం డ్రెయినేజీలో మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి..



పోసుమేర (ఫైల్)

భీమిని: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దపేట గ్రామానికి చెందిన వశాఖ పోసుమేర (49) గురువారం ఇంట్లో ఉన్న కూలర్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఎగిరిపడ్డాడు. గమనించిన అతని భార్య నానుబాయి లేపే ప్రయత్నం చేస్తుండగా ఆమె సైతం షాక్‌కు గురైంది. వెంటనే గమనించిన వారి కోడలు కరంట్ ప్లగ్ తీసివేయడంతో నానుబాయికి ప్రాణాపాయం తప్పింది. పోసుమేరను ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. నానుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు..



భానుదాస్ (ఫైల్)

గుడిహత్నూర్: మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన తిడ్కే భానుదాస్ (80) మృతి చెందగా, వరుసకు సోదరుడైన బోదిడి (కే) గ్రామానికి చెందిన గుట్టే బాబారావు తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుల బంధువులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వరుసకు సోదరులైన భానుదాస్, బాబారావు గురువారం కిన్వట్ నుంచి గుడిహత్నూర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరారు. స్థానిక బస్టాండ్‌కు అతి సమీపంలోనే ఆదిలాబాద్ వైపు వేగంగా వెళ్తున్న కంటైనర్ లారీ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న బాబారావుకు తీవ్రగాయాలుకాగా భానుదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై దిలీప్ తెలిపారు.

మరో రెండు నిమిషాల్లో గమ్యస్థానానికి..

బంధువులను కలవడానికి వచ్చిన సోదరులు మరో రెండు నిమిషాల్లో వారి గమ్యస్థానానికి చేరే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో భానుదాస్ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

పాముకాటుతో మహిళ..

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల తుర్కపల్లికి చెందిన మంద శ్రీలత (30) పాము కాటుతో మృతి చెందింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు శ్రీలత బుధవారం తెల్లవారు జామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా పాము కాటువేసింది. విషయాన్ని తన భర్తకు చెప్పడంతో 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రాజు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతిని దూషించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని అటెండర్ కాలనీకి చెందిన యువతిని వాట్సాప్‌లో అసభ్యకరంగా దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని పాఠన్‌కు చెందిన గొంటిముక్కుల కిరణ్ వాట్సాప్‌లో చాటింగ్ చేసి యువతిని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు జూన్ 6న ఫిర్యాదు చేయగా గురువారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య



భోజన్న (ఫైల్)

లోకేశ్వరం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన గాంధిరి భోజన్న (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం అప్పుచేసి కుమార్తె ప్రవళిక వివాహం జరిపించాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..



రాంచందర్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన నస్పూరి రాంచందర్ (38) భార్య ఏడేళ్ల క్రితం అతన్ని విడిచిపెట్టి వెళ్లగా ఒంటరిగానే ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి పెద్దవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అందవెల్లి, బోడపల్లి గ్రామాల మధ్య మృతదేహం కనిపించడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డబ్బులు వసూలు చేసిన ముఠా సభ్యుల అరెస్టు

తాంసి: తన సొంత ఎద్దులను విక్రయించేందుకు తీసుకెళ్తున్న రైతును బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఏడుగురు ముఠా సభ్యులపై కేసు నమోదు చేయగా నలుగురిని గురువారం అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఫణీందర్ తెలిపారు. తలమడుగు మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన ఆత్మారాం గతేడాది సెప్టెంబర్ 23న మహారాష్ట్రకు చెందిన బొలెరో వాహనాన్ని అద్దెకు తీసుకుని తన పశువులను ఆదిలాబాద్‌లో విక్రయించేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో పొన్నారి గ్రామ శివారులో ఆదిలాబాద్‌కు చెందిన రోహిత్ షిండే, విశ్వతేజ, ధగడ్‌సాయి, మహేష్, శివ, రమేశ్ వైరాగి, విజయ్ కేంద్రె వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌పై చేయి చేసుకోవడంతో పాటు రైతును బెదిరించి రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితుడు మంగళవారం తాంసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశామని, ముగ్గురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

కార్మికశాఖ అధికారులపై హైకోర్టు ఆగ్రహం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై హైకోర్టు కార్మిక శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం కార్మిక శాఖ అధికారులు హాజరై ఆగస్టు 14న ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడంతో షెడ్యూల్‌తో హాజరు కావాలని చెబితే మళ్లీ ఎన్నికల తేదీ అంటూ నాటకాలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నెల 28న ఎన్నికల షెడ్యూల్‌తో హాజరు కావాలని లేనిపక్షంలో ప్రిన్సిపల్ సెక్రెటరీకి సమన్లు జారీ చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

ముగిసిన డైట్ ప్రవేశాలు

- ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో మిగిలిన సీట్లు

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలల్లో ప్రవేశాలు గురువారంతో ముగిశాయి. ఐదేళ్లగా నవంబర్, డిసెంబర్ మాసాల్లో ప్రవేశాలు జరుగుతుండగా ఈ ఏడాది ప్రభుత్వం ముందుగానే కౌన్సెలింగ్ నిర్వహించింది. మొదటి విడత జూలై 1న, రెండో విడత జూలై 7, మూడో విడత జూలై 23న అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టిందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో తెలుగు మీడియంలో 50 సీట్లకు 46 సీట్లు భర్తీ కాగా నాలుగు మిగిలిపోయాయి. ఇంగ్లిష్ మీడియంలో 50 సీట్లకు గానూ 47 భర్తీ కాగా మూడు మిగిలాయి. ఉర్దూ మీడియంలో 50 సీట్లకు గానూ 40 భర్తీ కాగా 10 మిగిలాయి. భైంసాలోని జేపీ లడ్డా కళాశాలలో 40 సీట్లకు గానూ 39 భర్తీ కాగా ఒక్కసీటు మిగిలింది. నిర్మల్‌లోని పంచశీల్ కళాశాలలో 40 సీట్లకు గానూ 39 భర్తీ కాగా ఒక సీటు మిగిలింది. ఉట్నూర్‌లోని పూలాజీబాబా కళాశాలలో 40 సీట్లకు గానూ 35 భర్తీ కాగా ఐదు సీట్లు మిగిలాయి. మంచిర్యాలలోని ఎస్ఆర్‌కేఎం కళాశాలలో 40 సీట్లకు గానూ 38 భర్తీ కాగా రెండు మిగిలాయి. ఆదిలాబాద్‌లోని వివేకానంద కళాశాలలో తెలుగు మీడియంలో 40 సీట్లకు గానూ 28 భర్తీ కాగా 12 సీట్లు మిగిలాయి. ఇంగ్లిష్ మీడియంలో 40 సీట్లకు గానూ 35 భర్తీ కాగా 5 సీట్లు మిగిలినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమంతప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఫేషియల్ అటెండెన్స్ ద్వారా హాజరు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా తరగతులకు గైర్హాజరైతే వారిని పరీక్షలకు అనుమతించడం జరగదని వివరించారు.

కేంద్రం నిధులతోనే పాఠశాలల అభివృద్ధి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



క్రీడాకారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అయ్యారని, ఉన్నత పదవులు అధిరోహించడం హర్షణీయమన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి రీజినల్ లెవల్‌కు బాలుర విభాగంలో ఆరుగురు బాస్కెట్‌బాల్‌లో, హ్యాండ్ బాల్‌లో 9 మంది, వాలీబాల్ ఇద్దరు, బాలికల విభాగంలో బాస్కెట్ బాల్ నుంచి ముగ్గురు, హ్యాండ్‌బాల్‌లో ఏడుగురు, వాలీబాల్‌లో ఇద్దరు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అన్ని విభాగాల్లో 17 మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి 75 మంది బాలురు, 59 మంది బాలికలను రీజినల్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 26న కేరళలోని కాసర్‌ఘడ్‌లో జరిగే వాలీబాల్, 27న విజయనగరంలో జరిగే హ్యాండ్‌బాల్, 28న రంగారెడ్డిలో జరిగే వాలీబాల్ రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పార్వతి, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

యూరియా తరలిస్తున్న ప్రధాన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

జైనథ్ : ఈనెల 8న రెండు వాహనాల్లో 150 యూరియా బస్తాలను మహారాష్ట్రకు తరలిస్తున్న ముఠాను అరెస్టు చేసి బేల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడైన సునీల్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను ముఠాగా ఏర్పడ్డ కొందరు అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ఈ ముఠాలో కీలక సభ్యుడైన హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ప్రొప్రయిటర్‌ను అదుపులోకి తీసుకుని రెండు వాహనాలను సైతం సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ ముఠాలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్పంగా వరద నీరు

మామడ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1068.80 అడుగులు(21.369 టీఎంసీలు) నిల్వ ఉంది. గతేడాది జూలై 24 న ప్రాజెక్టులో 1070.60 అడుగులు (24.376 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గోదావరినది ఎగువ నుంచి 2,579 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 11.519 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

